విధులపై అప్రమత్తంగా ఉండాలి

- జీఈసీవో గౌసియాబేగం
- కేజీబీవీలో విచారణ

కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న గౌసియాబేగం

నర్మెట, జూలై 14 : ఉపాధ్యాయులు, సిబ్బంది విధులపై అప్రమత్తంగా ఉండాలని జీఈసీవో గౌసియాబేగం అన్నారు. మండలంలోని మాన్‌సింగ్‌తండా కస్తూర్బా బాలికల పాఠశాల నుంచి శుక్రవారం అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థినులు వెళ్లిపోయిన విషయమై ఆదివారం ఆమె విచారణ చేపట్టారు. విద్యార్థులు హాస్టల్ నుంచి పారిపోయిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కేజీబీవీలోని విద్యార్థినులతో గౌసియాబేగం మాట్లాడారు. పాఠశాలలో మౌలిక వసతులు ఉన్నాయా..? ఉపాధ్యాయులతో ఎవరికైనా సమస్యలున్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. పాఠాలు అర్థం కాకుంటే చెప్పాలన్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా..? అని తెలుసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. గౌసియాబేగం మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాల మండల కేంద్రానికి దూరంగా ఉండడంతో అప్రమత్తంగా ఉండాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు తెలిపారు. రాత్రి వేళల్లో బయటకు వెళ్లకూడదన్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఆమె తెలిపారు. ఆమె వెంట ఎస్‌వో రజిత, సిబ్బంది ఉన్నారు.

నర్మెట : వెల్దండలో పీరీలను ఊరేగిస్తున్న భక్తులు

గ్రామాల్లో పీరీల ఊరేగింపు

నర్మెట, జూలై 14 : మొహర్రం వేడుకలను పురస్కరించుకొని మండలంలోని ఆయా గ్రామాల్లో మతాలకు అతీతంగా భక్తులు పీరీలను ఊరేగించారు. ముస్లింలు, హిందువులు కలిసి పీరీలను ప్రతిష్ఠించారు. ఆదివారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో డప్పుచప్పుళ్లతో ఊరేగించారు. వీధుల్లో ఇంటింటికీ భక్తులు పీరీలను తీసుకెళ్లగా మహిళలు నీళ్లారబోశారు. బెల్లం, కుడుకలతోపాటు కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించా రు. పీరీల ఊరేగింపుతో గ్రా మాల్లో సందడి నెలకొంది. రాత్రి వేళల్లో ఆల్వ చుట్టూ తిరుగుతూ అస్సె దులా హార తి అని పాటలు పాడుతూ వేడుకలు నిర్వహించారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట : మండలంలోని ఆలింపూర్, కట్కూర్, బచ్చన్నపేట, చిన్నరామన్‌చర్ల, నాగిరెడ్డిపల్లి, వీఎస్సార్‌నగర్‌లో ఆదివారం పీరీల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం, సాయంత్రం డప్పుచప్పుళ్లతో హిందూ, ముస్లింలు ఇంటింటికీ పీరీలను తీసుకెళ్లారు. దీంతో స్థానికులు మొక్కులు చెల్లించారు. అల్వాల వద్ద పిల్లలు, పెద్దలు ఆటపాటలతో హోరెత్తించారు.

బచ్చన్నపేట : కట్కూర్‌లో పీరీలకు మొక్కులు చెల్లిస్తున్న ప్రజలు

కామన్ సర్వీస్ సెంటర్ కమిటీ ఎన్నిక

నాగయ్య, రాపోలు లక్ష్మణ్

పాలకుర్తి, జూలై14: కామన్ సర్వీస్ సెంటర్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా మాసంపల్లి నాగయ్య, సహాయ కార్యదర్శిగా రాపోలు లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కామన్ సర్వీస్ సెంటర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ జిల్లా కమిటీ ఇచ్చిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తామన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-318953

TOURS & TRAVELS

★ మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536

PLOT FOR SALE
★ వరంగల్ హైవేలోని ఆలేరు-కొలనుపాకలో ఓపెన్ ప్లాట్లు మరియు ఫార్మ్‌ల్యాండ్ ప్లాట్లు అమ్మబడును. సాగర్ హైవేలో ఇండస్ట్రియల్ ఏరియాగా అభివృద్ధి చెందుతున్న యాచారంనందు ఓపెన్ ప్లాట్లు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్ & క్లియర్ టైటిల్. Ph: 7989747927.
NT-325882

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

సాంప్రదాయ దుస్తుల్లోనే దర్శించుకోవాలి

వరంగల్, జూలై 14 : నగరంలోని భద్రకాళీ అమ్మవారిని దర్శించుకునే భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి రావాలని ఈవో శేషుభారతి తెలిపారు. ఇటీవల అమ్మాయిలు ఫ్యాషన్‌గా జుట్టు విరబోసుకుని అమ్మవారి దర్శనానికి వస్తున్నారని, అలా రాకుడదని తెలిపారు. అమ్మాయిలు లంగావోణి ధరించి, సాంప్రదాయంగా జడ వేసుకోవాలని, కనీసం జుట్టుకు రబ్బర్ బాండ్ పెట్టుకుని రావాలని సూచించారు.

బల్దియా గ్రీవెన్స్ రద్దు

వరంగల్, జూలై 14 : బల్దియా కార్యాలయంలో ఈ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా కారణాల వల్ల గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించి ఫిర్యాదులు ఇచ్చేందుకు కార్యాలయానికి రావొద్దని కోరారు.

వైన్స్ షాపుల సిండికేట్..

- అధిక ధరకు మద్యం విక్రయాలు
- నిబంధనలు పాటించని షాపుల యజమానులు
- కల్తీ జరుగుతున్నా పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 14 : మద్యం ప్రియుల బలహీనతను ఆసరా చేసుకున్న వైన్స్ షాపుల యజమానులు అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ ఎమ్మార్పీ కంటే అదనపు ధరలకు అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఇందుకు నిదర్శనంగానే మండలంలోని మద్యం షాపుల యజమానులు సిండికేట్‌గా మారి దోపిడీ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. క్వాటర్ బాటిల్‌కు అదనంగా రూ.15, హాఫ్‌కు రూ.30, ఫుల్ బాటిల్‌కు రూ.60 వరకు వసూలు చేస్తున్నారు. ఒక్కో షాపులో ప్రతి రోజు సుమారు రూ.8 వేల నుంచి రూ.10 వేలకు అదనపు మద్యం ప్రియుల నుంచి వసూలు చేస్తున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో ఏడు మద్యం షాపులు ఉండగా, నెలకు సుమారు రూ.20 లక్షల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారని పలువురు బాహాటంగా విమర్శిస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో బెల్ట్ షాపుల వారి వద్ద నుంచి సుమారు రూ.5 వేల చొప్పున డిపాజిట్ చేయించుకుంటున్నారని తెలిసింది. అదనపు సంపాదనకు అలవాటుపడిన మద్యం షాపుల యజమానులు ఎమ్మార్పీకి మించి అదనంగా వసూలు చేస్తున్నారు. అయినా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో విమర్శలొస్తున్నాయి.

బెల్ట్‌షాపులతో మరింత దోపిడీ..

పలు మద్యం షాపుల యజమానులు మండలంలోని అనేక గ్రామాల్లో బెల్ట్‌షాపులకు మద్యాన్ని తరలిస్తున్నారు. అక్కడ అదనపు ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. షాపుల నుంచి పంపిన మద్యాన్ని విక్రయిస్తున్నారా లేక ఇతర మండలాల నుంచి మద్యాన్ని తీసుకొచ్చి విక్రయిస్తున్నారా అని తెలుసుకునేందుకు తరచూ తనిఖీలు చేస్తున్నారు. మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి అనుచరులను ఏర్పాటు చేసుకుని బెల్ట్‌షాపులను కొనసాగిస్తున్నట్లు తెలిసింది. అదనంగా లాభాలు గడించేందుకు మద్యాన్ని కల్తీ చేసి విక్రయిస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ మద్యం షాపులకు కూతవేటు దూరంలో ఉన్నా సంబంధిత అధికారులు తనిఖీ చేయకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. మామూళ్లకు అలవాటుపడిన కొందరు ఎక్సైజ్ అధికారులు ఎమ్మార్పీకి మించి మద్యాన్ని విక్రయిస్తున్న వైన్స్ షాపులపై చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కల్తీ మద్యాన్ని అరికట్టాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సిండికేటుకు అనుమతి లేదు..

వైన్స్ షాపుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం అమ్మకాలు కొనసాగాలి. అధిక ధరలకు మద్యం అమ్ముతున్నట్లు మా దృష్టికైతే రాలేదు. షాపుల వారీగా కొనుగోలు చేసిన మద్యం మాత్రమే ఉండాలి తప్ప అందరి తరపున ఒకే చోట మద్యాన్ని నిల్వ చేసి అమ్మకాలు కొనసాగించొద్దు. సిండికేట్‌గా మారితే షాపు ల యజమానులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. ఇందులో ఎలాంటి సందేహం అవసరం లేదు.

- భాస్కర్‌రావు, ఎక్సైజ్ సీఐ

ఆహ్లాదకరంగా సోమనాథుడి స్మృతివనం

పాలకుర్తిలోని సోమనాథుడి స్మృతివనం

పాలకుర్తి, జూలై 14: మండల కేంద్రంలోని సోమేశ్వరాలయం సమీపంలో ఏడాది క్రితం నిర్మించిన తొలి తెలుగు కవి, పాల్కుర్కి సోమనాథుడి స్మృతివనం పర్యాటకులను ఆకర్షిస్తున్నది. బీఆర్ఎస్ పాలనలోనే సీఎం కేసీఆర్ సుమారు రూ.3 కోట్లు నిధులు మంజూరు చేయడంతో సోమనాథుడి స్మృతివనం నిర్మించారు. దీనిని నాటి మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, తన్నీరు హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతిరాథోడ్ ప్రారంభించారు. ప్రస్తుతం పచ్చటి పొలాల నడుమ ఆహ్లాదకర వాతావరణంలో పర్యాటకులను ఆకట్టుకునేలా స్మృతివనం ఉంది. నిత్యం సోమేశ్వరాలయానికి వస్తున్న భక్తులు సోమనాథుడి చరిత్రను తెలుసుకుని పులకించిపోతున్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్ట్

వర్ధన్నపేట, జూలై 14: సినిమా థియేటర్‌లో యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రవీణ్‌కుమార్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఈ నెల 12న వర్ధన్నపేట సినిమా థియేటర్‌లో కళ్లెం విజయ్(19) స్నేహితులతో కలిసి సినిమా చూస్తున్నాడు. ఈ క్రమంలో ఇల్లంద గ్రామానికి చెందిన ఊర కృష్ణ(36) విజయ్‌పై కత్తితో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆదివారం కృష్ణను ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు వద్ద అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన కళ్లెం విజయ్ వర్ధన్నపేటలో ఇనుప సామను దుకాణంలో పని చేస్తున్నాడు. ఇల్లందకు చెందిన కృష్ణ కుమార్తెను అతడు ప్రేమిస్తున్నాడనే విషయాన్ని మనసులో పెట్టుకొని అదును చూసి దాడి చేసినట్లు తెలిసింది.

పౌరహక్కుల నేత డాక్టర్ రామనాథం సతీమణి మృతి

కాశీబుగ్గ, జూలై 14: వరంగల్ నగరానికి చెందిన పౌరహక్కుల రాష్ట్ర నాయకుడు దివంగత డాక్టర్ రామనాథం సతీమణి లక్ష్మి(87) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. మట్టెవాడ గోపాలస్వామి ఆలయ ప్రాంతంలోని ఆమె నివాసానికి ఆదివారం పలువురు పౌరహక్కుల నేతలు చేరుకొని లక్ష్మి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుమారు 35 ఏళ్ల క్రితం డాక్టర్ రామనాథం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే.

కమిషనరేట్‌లో డ్రగ్స్ కంట్రోల్ టీం: సీపీ

సుబేదారి, జూలై 14: మత్తు పదార్థాల నియంత్రణ కోసం వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో డ్రగ్స్ కంట్రోల్ టీం ఏర్పాటు చేసినట్లు పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. యువత, విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిస కాకుండా గంజాయి ఇతర మత్తు పదార్థాలను నియంత్రించడానికి ఈ డ్రగ్స్ టీం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల రవాణా, విక్రయాలు, సేవించే ప్రాంతాలపై ఈ టీం నిఘా పెట్టి, ఉక్కుపాదం మోపుతోందని తెలిపారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రవాణా చేసినా, సేవించిన వెంటనే 8712584473 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వ్యక్తులకు నగదు పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. గంజాయి రహిత పోలీసు కమిషనరేట్ కోసం అందరూ కృషిచేయాలని సీపీ ఒక ప్రకటనలో కోరారు.

లింగాలఘనపురం : పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరైన వారు

బచ్చన్నపేటలో కలుసుకున్న పూర్వ ఇంటర్ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

లింగాలఘనపురం, జూలై 14 : మండలంలోని నెల్లుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990-1991 టెన్త్ విద్యార్థులు ఆదివారం ఓ ఫంక్షన్‌హాల్‌లో కలుసుకున్నారు. అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించి చిన్ననాటి జ్ఞాపకాలను వారు గుర్తు చేసుకున్నారు. నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నెల్లుట్ల రవీందర్‌రావు, రెహమన్, వరూధిని, లీల, పూర్వ విద్యార్థులు శివరామకృష్ణ, ప్రభాకర్, నరేందర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని శ్రీనిధి గార్డెన్స్‌లో 1978-80 విద్యా సంవత్సరాల్లో ఇంటర్ చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. నాలుగు దశాబ్దాలు దాటిన అనంతరం కలుసుకున్న వీరు చిన్ననాటి స్మృతులను నెమరువేసుకున్నారు. ఎవరెవరు ఏఏ హోదాలో ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. అందరం ఇన్నాళ్లకు కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. సుమారు 50 మంది ఈ వేడుకల్లో పాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈదులకంటి ప్రతాప్‌రెడ్డి, శంకర్, ప్రభాకర్, ఆంజనేయులు, జీవన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రమేశ్, సురేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాజేశం, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి రైతు మృతి

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 14 : ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని నమిలిగొండలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండీ అజ్మత్ (35) తన వ్యవసాయభూమి పక్కన గల మరో రైతు భూమిని ఆదివారం ట్రాక్టర్‌తో దున్నుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అజ్మత్ ట్రాక్టర్ కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని చికిత్స కోసం వరంగల్‌లోని దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో అజ్మత్‌ను హైదరాబాద్‌లోని దవాఖానకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనతో నమిలిగొండలో విషాదం నెలకొంది.

కేయూ ప్రొఫెసర్ సురేశ్‌లాల్‌పై కేసు

సుబేదారి, జూలై 14 : బిల్డింగ్ నిర్మాణ పనులు అడ్డుకొని, పిల్లర్లను కూల్చివేసిన ఘటనలో బాధితుడి ఫిర్యాదుతో కేయూ ప్రొఫెసర్ బానోత్ సురేశ్‌లాల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భం గా బాధితుడు మారపల్లి సుజన్‌కుమార్ మాట్లాడుతూ హనుమకొండ సర్క్యూట్ గెస్ట్‌హౌస్ రోడ్డులో సర్వేనంబర్ 208లో తనకున్న 469 గజాల ఇంటి స్థలంలో మున్సిపల్ అనుమతితో భవనం నిర్మిస్తున్నానని తెలిపాడు. అయితే,ప్రొఫెసర్ సురేశ్‌లాల్ ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 207 పేరుతో తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి, ఆ ప్లాట్ తనదేనని బిల్డింగ్ నిర్మాణ పనులను జేసీబీ, మనుషులతో కూల్చివేశాడని ఆరోపించారు. బాధితుడు సుజన్‌కుమార్ ఫిర్యాదు చేయగా, సురేశ్‌లాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

పేదలకు సాయం చేయడమే లక్ష్యం

బచ్చన్నపేట, జూలై 14 : పేదలను ఆదుకోవడమే నా జీవిత లక్ష్యమని, ఇందుకనుగుణంగా ముందుకెళ్తున్నట్లు బీఆర్ఎస్ నేత, సామాజిక సేవా కార్యకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని కొన్నెలో ద్యాగరి యాదగిరి(75) మృతి చెందగా మృతుడి కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ పేదలను ఆదుకుంటేనే తనకు ఆత్మసంతృప్తి కలుగుతుందన్నారు. ఉప్పరి రఘుపతి, ఉప్పరి యాదగిరి, చెవిటి రామయ్య, భాస్కర్, మాతయ్య, జగతి, సత్తయ్య పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న కోడూరి శివకుమార్ గౌడ్


ఎమ్మెల్యే కడియం శ్రీహరితో నాయకులు

ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే శ్రీహరికి శుభాకాంక్షలు

చిల్పూరు, జూలై 14 : పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ఎంపీగా గెలిచిన కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మండలంలోని కృష్ణాజిగూడెం వాసులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని వారి నివాసంలో ఎంపీ, ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి చేరాలు, మాజీ ఎంపీటీసీ మారపాక ఇస్సాక్, నాయకులు మారపాక అజయ్, ఎర్రబెల్లి శ్రీను, మారపాక వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి ఆనందం, మారపాక రేణుక, రాజేశ్వరి, ఎర్రబెల్లి ఐల్లమ్మ, ఎర్రబెల్లి కోమల పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాయకుడు సేవెల్లి సంపత్

కేటీఆర్‌ను కలిసిన సేవెల్లి సంపత్

లింగాలఘనపురం, జూలై 14 : మండలంలోని వనపర్తికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్ సేవెల్లి సంపత్ ఆదివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును వేర్వేరుగా కలిశారు. తన పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయన వారికి పుష్పగుచ్ఛం అందించి ఆశీస్సులు పొందారు. అనంతరం స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యను సైతం కలిసి ఆశీర్వాదం పొందారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సేవెల్లి మధు, దండిగ మహేశ్ తదితరులు ఉన్నారు.

రాఘవరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

జంగా రాఘవరెడ్డికి పలువురి శుభాకాంక్షలు

నర్మెట, జూలై 14 : తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జంగా రాఘవరెడ్డిని మండలంలోని కాంగ్రెస్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ నక్కల గట్టయ్య, నాయకులు సారాబు మధు, గోపగోని నరేశ్‌గౌడ్, కన్నెబోయిన రామకృష్ణ, బూస అంజయ్య, ముక్కెర రాజేశ్, గొట్టె రాజశేఖర్, సీపీఐ మండల కార్యదర్శి పాతూరి ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలి

కాంట్రాక్టర్ కనకం గణేశ్

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 14 : అప్పులు చేసి అభివృద్ధి పనులు పూర్తి చేసినా నేటికీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాంట్రాక్టర్ కనకం గణేశ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టెండర్ ద్వారా డివిజన్ కేంద్రంలో రూ. 20 లక్షలతో సెంట్రల్ లైటింగ్ పనులను గత సంవత్సరం ఏప్రిల్‌లో పూర్తి చేశానని వివరించాడు. అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేశానని, వాటికి వడ్డీలు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని వివరించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం మాలాంటి చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదని గణేశ్ ఆవేదన చెందారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడం లేదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించి ఆదుకోవాలని గణేశ్ విజ్ఞప్తి చేశారు.

ప్రభాకర్‌రావుతో రచనలను ఆవిష్కరిస్తున్న రవీందర్‌రావు

పీవీ ప్రభాకర్‌రావుకు ఘన సన్మానం

లింగాలఘనపురం, జులై 14 : మండలంలోని నెల్లుట్లకు చెందిన నెల్లుట్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నెల్లుట్ల రవీందర్‌రావు ఆదివారం దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తనయుడు పీవీ ప్రభాకర్‌రావును సన్మానించారు. పీవీ నరసింహరావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని వైష్ణవి భవన్‌లో నియోగబ్రాహ్మణ కరణపుసమాజము రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. సందర్భంగా నెల్లుట్ల రవీందర్ రావు దివంగత ప్రధాని పీవీ నరసింహరావుపై రాసిన రచనల సంపుటిని పీవీ ప్రభాకర్‌రావు చేతులమీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోగ బ్రాహ్మణ కరుణపు సమాజం రాష్ట్ర అధ్యక్షుడు రాంప్రసాద్‌రావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

నిత్యావసర సరుకులు అందిస్తున్న శ్రీకాంత్

పాలకుర్తి, జూలై 14: మండలంలోని వావిలాలకు చెందిన కోల శ్రీను ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆదివారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జీడి హరీశ్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారు మాట్లాడుతూ నిరుపేదలకు సాయం చేసేందుకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఒర్రె కుమారస్వామి, కోల లక్ష్మణ్ , బండి కిరణ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాల కోసం గౌడ కులస్తుల పూజలు

కొడకండ్ల, జూలై 14 : వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగుండాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన గౌడ కులస్తులు ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వనాలకు వెళ్లి గ్రామ దేవతలకు మొక్కలు చెల్లించారు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలవుతున్నా నేటికీ చెరువులు, కుంటలు నిండలేదు. కేవలం మెట్ట పంటలకు మాత్రమే వాతావరణం అనుకూలంగా ఉంది. పొలాలను దున్ని వరి నాట్ల కోసం ఎదురుచూస్తున్న రైతుల కోసం వరుణుడు కరుణించాలని గౌడ కులస్తులు పూజలు చేసినట్లు గోపా నియోజకవర్గ కన్వీనర్ దేశగాని నాగరాజు గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశగాని శ్రీశైలం గౌడ్, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు